క్లుప్తంగా

9 నుంచి సంక్షేమ పథకాల బోర్డుల ప్రదర్శన

కొల్లిపర: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించే విధంగా బోర్డులను ఆయా గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శించనున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్లెకు పోదాం షెడ్యూలను సోమవారం వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో నాలుగున్నర ఏళ్లలో పేదలకు అందించిన సంక్షేమాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఈనెల 9న కొల్లిపర గ్రామ సచివాలయం, 10న కొల్లిపర గ్రామ సచివాలయం- 2, 14న కొల్లిపర గ్రామ సచివాలయం- 3 , 15న మున్నంగి గ్రామ సచివాలయం- 1 , 16న మున్నంగి గ్రామ సచివాలయం- 2 , 17న వల్లభాపురం గ్రామ సచివాలయం- 1, 20వ తేదీన వల్లభాపురం గ్రామ సచివాలయం- 2, 21న బొమ్మువాని పాలెం గ్రామ సచివాలయం, 22న తూములూరు గ్రామ సచివాలయం, 23న అత్తోటలో ఆయా గ్రామ సచివాలయంలో ఆయా తేదీలల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కొల్లిపర: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి సోమవారం తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీపీ పద్మావతి అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవాశాంతి ఆశ్రమంలో సోమవారం శ్రీవెంకటేశ్వరయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.యోగ సభ్యులు సోమరౌతు ఏసుబాబు కుమారుడు భవన్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కఠెవరం మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు గంపల శివనాగేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, గవిన్‌కుమార్, అనూష, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

తెనాలిటౌన్: పట్టణ సాలిపేట, తులసీరామ్‌చౌక్‌లలో ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు సోమవారం పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు లయన్ నంబూరు శ్రీకుమార్ భార్య నంబూరు వరలక్ష్మి పుట్టినరోజు పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, క్లబ్ సెక్రటరీ నేరెళ్ల కృష్ణమోహన్, పాదర్తి వెంకటేశ్వరరావు, కొణిజేటి రమేష్‌కృష్ణ, అయినాల మల్లేశ్వరరావు, కొత్తపల్లి రాజ్‌కుమార్, నంబూరు సిరిఅభిజ్ఞ, ఉపాధ్యాయులు కాట్రగడ్డ భాగ్యలక్ష్మి, అరుణ, నగరాజకుమారి, శైలజ, వెంకటకృష్ణ, సురేష్‌బాబు పాలొన్నారు.

82 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ, 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు పి.ఎస్తేరురాణి శిబిరంలో 82మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 40మందికి బీపీ, షుగర్ ఉన్న వారికి రక్త, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, 104వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, సింగరాజు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం ఆడిట్‌పై ప్రజావేదిక

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ పూర్తయినందున మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక ఏర్పాటు చేశామని, కావున సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని తెలిపారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- దావులూరిపాలెం గౌడ సంఘం రచ్చబండ షెల్టర్ ప్రారంభం


గౌడసంఘీయుల రచ్చబండ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అజెండాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కొల్లిపర మండలం దావులూరిపాలెంలో దాత మోర్ల శ్రీను ఆధ్వర్యంలో నిర్మించిన గౌడ సంఘీయుల రచ్చబండ షెల్టర్‌ను ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు బేతాల భూషణం అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంక్షేమ విప్లవం ప్రతి కుటుంబానికి లబ్ధిని చేకూర్చినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో తెనాలి నియోజకవర్గంలో 86 శాతం మందికి రూ.1800 కోట్లను వారి ఖాతాల్లో నేరుగా జమచేసినట్లు వివరించారు. దావులూరిపాలెంలోనే గత నాలుగున్నర సంవత్సరాల్లో 2 కోట్ల 57 లక్షల రూపాయల సంక్షేమ పథకాల రూపంలో అందజేశామన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 25 మంది మంత్రులుంటే, 17 మంది ఆయా వర్గాల మంత్రులు ఉన్నట్లు గుర్తుచేశారు. వైకుంఠపురం వ్యవస్థాపకుడు గౌడ కులస్తులైనప్పటికీ వారికి ఇప్పటి వరకు పదవి దక్కలేదని చెప్పారు. ఈ సారి ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా గౌడ వర్గీయుడు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక, తమకు ఏమాత్రం మేలు జరిగిందేనేది ప్రతి కుటుంబం చర్చించుకోవాలని, మేలు జరిగిందని భావిస్తేనే తననూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నూతనంగా నిర్మించిన రచ్చబండ ఇందుకో వేదికగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మ(రె)డ్డి శివరామకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ నేతలు అద్దంకి వేణుగోపాలగౌడ్, యేమినేని శేషగిరి, కాటూరి నాగమల్లేశ్వరరావు, కాటూరి రెడ్డిమ్మ, తూములూరు గ్రామ ఉపసర్పంచి మ(రె)డ్డి బ్రహ్మారెడ్డి, కొల్లి రాఘవరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.

స్విమ్మర్‌ను అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణ చెంచుపేటకు చెందిన రావి కిరణ్‌కుమార్ ఇటీవల కర్నాటక రాష్ట్రంలోని హుబ్లీలో నిర్వహించిన కర్నాటక ఓపెన్ నేషనల్ మాస్టర్ గేమ్స్–2023లో స్విమ్మింగ్ పోటీల్లో పతకాన్ని సాధించాడు. 50 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి కాంస్యపతకాన్ని అందుకున్నారు. సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే శివకుమార్ ఆయనను అభినందించి, మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

తెనాలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యం లభిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అన్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని 39వ వార్డు సచివాలయం ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వి.మహిత, డాక్టర్ వి.దేవికారాణి, డాక్టర్ బాబూరావు, డాక్టర్ సాయి వెంకటేష్, డాక్టర్ అశోక చక్రవర్తి, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ సాయిప్రతిమ సేవలందించారు. ఈ సందర్భంగా స్టేట్‌బ్యాంక్ ఇండియా సౌజన్యంతో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలను మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. డివిజనల్ అభివృద్ధి అధికారి కె.పద్మావతి శిబిరాన్ని సందర్శించారు. వైద్యులు, రోగులతో మాట్లాడారు. మెరుగైన చికిత్సను అందించాలని వైద్యులకు సూచించారు. డీపీఎంఓ జంగం శ్యామ్, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సబ్‌యూనిట్ అధికారి కంతం ఉమాకాంత్, సూపర్‌వైజర్ బండారు మల్లేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, ఆరోగ్య సహాయకుడు నవీద్ టీబీ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్, హెల్త్ విజిటర్ ఎస్.లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, దాసరి విజయకుమారి, దాసరి సత్యం, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్త మువావత్ లీలావతిబాయి, సుజాత బాయి పాల్గొన్నారు.

పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం

తెనాలి: వేజళ్ల వెంకట సుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఉన్న స్మారక విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్రీడాపోటీలను జరిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ ఆయన పేరిట ఏటా విద్య, వైద్య సేవలు, వృద్ధులకు ఆర్థిక చేయూతను అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యాకమిటీ చైర్మన్ ఎం.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సదుపాయాలతోపాటు సేవాసంస్థలు ఇచ్చే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ అధ్యక్షత వహించారు. మొక్కలను పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుతాం...అంటూ ఎన్‌సీసీ అధికారి బి.వెంకట్ పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ట్రస్ట్ సభ్యురాలు నవ్య, పాఠశాలకు మొక్కలు బహూకరించారు. ట్రస్ట్ సభ్యులు ఓంకార్ ప్రసాద్, బి.శివరామకృష్ణ, బి.శివసాయిప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణహిత దీపావళిపై అవగాహన ర్యాలీ

తెనాలి: స్వచ్ఛ దీపావళి- శుభ దీపావళి...అనే నినాదంతో పర్యావరణహితంగా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని కోరుతూ మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాయుకాలుష్యాన్ని నివారించి, శ్వాసకోశ వ్యాధులు రాకుండా చూసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాల్లోని పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరుతూ ర్యాలీలో నినాదాలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్, వై.అనుపమ, ఎం.సుబ్బారావు, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు, పి.సుధాకర్, శానిటేషన్ కార్యదర్శులు కె.నాగరాజు, ఎ.ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాస్, ఎస్.నరేష్‌బాబు, డీఎస్ఓ షరీఫ్ పాల్గొన్నారు.


మున్సిపల్ ప్రజారోగ్య సిబ్బంది ర్యాలీ

బాణసంచా వ్యాపారులు అన్ని అనుమతులు కలిగి ఉండాలి

తెనాలిరూరల్: బాణసంచా వ్యాపారులు అన్ని అనుమతులు కలిగి ఉండాలని తహసీల్దార్ కె.రవిబాబు స్పష్టం చేశారు. మండలంలోని కొలకలూరు గ్రామంలోని బాణసంచా హోల్‌సేల్ దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. వ్యాపారులు జీఎస్టీ చెలిస్తున్నారా, అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా, నిబంధనలు పాటిస్తున్నారా? అన్న అంశాలను పరిశీలించారు. బాణసంచా వ్యాపారులు సంబంధిత అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనన్నారు. నిబంధనలు పాటించకపోతే బాణసంచా గోడౌన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలానే డీఎస్పీ బి.జనార్ధనరావు, పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంకట రూరల్ సీఐ కె.శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు ఉన్నారు.


దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిబాబు

లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలి



తెనాలి: పట్టణంలోని వ్యాపారులు లైసెన్సులను వెంటనే రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. ఏటా ఫిబ్రవరి నెలలోనే రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటికీ కొందరు రెన్యువల్ లేకుండా వ్యాపారాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. రెన్యువల్ చేసుకోకుంటే వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చి ప్రాసిక్యూషన్ చేస్తామని హెచ్చరించారు. కమిషనర్ ఆదేశానుసారం మున్సిపల్ సిబ్బంది సోమవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలను తనిఖీలు చేసి, లైసెన్సు లేని సంస్థలకు నోటీసులను ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్, శానిటేషన్ కార్యదర్శులు ఎ.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు, టి.శ్రీనివాస్, ఎస్.నరేష్‌బాబు, నగరదీపికలు భారతి, సుహాసిని, శానిటరీ మేస్త్రి డి.రవీంద్ర పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల అందజేత



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో సోమవారం దివంగత ధూళిపాళ్ల రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ ఇద్దరు బాలికలకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ క్లబ్ తరపున ఇప్పటి వరకు 115 మందికి సైకిళ్లను ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. తద్వారా బాలికలు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా సహకరించినట్లు చెప్పారు. నల్లజర్ల లోకేశ్వరరావు ఆధ్వర్యంలో మరో బాలికకు సైకిల్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ, గుత్తా వెంకటరత్నం, జీవీ నారాయణ, చేతన్ రాజ్ కొఠారి, నరేష్, కె.ప్రవీణ్, జాన్ కీట్స్, కిరణ్, గణేష్ యూత్, రొటేరియన్స్ మురళీకృష్ణ, సుభాని, అర్జున పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించాలి

ద్వామా పీడీ యుగంధర్‌కుమార్

తెనాలిటౌన్: ఉపాధి హామీ పథకం ద్వారా పని చేసే కూలీలలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ యుగంధర్‌కుమార్ ఆదేశించారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 16వ విడత ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ నందిని ఆధ్వర్యంలోజరిగిన సభలో ఆయన మాట్లాడారు. మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి ద్వారా చేపట్టిన పనులు, పంచాయతీ రాజ్ పనుల వివరాలను డీఆర్‌పీ మల్లికార్జున్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. సభలో అంబుడ్స్ విజిలెన్స్ ఆఫీసర్ క్రిస్టినా, ఏపీడీ కె.ఆనందమోహన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాపరెడ్డి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, డీఆర్‌పీలు మల్లికార్జున్, భరత్‌కుమార్, నాగరాజు, హరిబాబు, కల్యాణ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.


వివరాలను తెలియజేస్తున్న డీఆర్‌పీ మల్లికార్జున్

యడ్లపాడులో తెనాలి ఫొటోగ్రాఫర్ దుర్మరణం

యడ్లపాడు: బైక్‌పై ప్రయాణిస్తూ సినీఫక్కీలో 20 అడుగుల ఎత్తులో ఉన్న వంతెనపై నుంచి కిందపడి తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. తెనాలి పట్టణం రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కొడవటి ప్రభుకుమార్ (31) బైక్‌పై సోమవారం సాయంత్రం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో యడ్లపాడు వద్ద ప్రారంభంలో ఉన్న అండర్‌పాస్ వంతెనపై ఎక్కి మలుపు తిప్పే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎడమవైపు ఉన్న సైడ్‌వాల్‌కు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ప్రభుకుమార్ ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి వంతెన కింద ఉన్న సర్వీసు మార్గంలోని స్పీడ్‌బ్రేకర్లపై వచ్చి పడ్డాడు. 108 వాహన సిబ్బంది చేరుకుని యువకుడిని పరీక్షించి తలకు బలంగా తగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఊహించని ఈ సంఘటనకు ఈ బ్రేకర్లకు సమీపంలోని బైక్ మెకానిక్, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలతో పాటు సమీపంగా ఉన్న జనం చూసి షాకయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ పి సురేష్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పైనుంచి ఎలా పడి ఉంటాడని పైకి వెళ్లి చూడగా యువకుడి బైక్ వంతెనపై మలుపు వద్ద పడి ఉండటాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


మృతి చెందిన ప్రభుకుమార్

కార్పొరేషన్ అభివృద్ధికి రోడ్ల విస్తరణ తప్పనిసరి

- ప్రజలు సహకరించాలి
- కమిషనర్ యు.శారదాదేవి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మరింత శరవేగంగా అభివృద్ధి చెందాలంటే రహదారుల విస్తరణ తప్పనిసరి అని కార్పొరేషన్ కమిషనర్ యు శారదాదేవి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం తెనాలి రోడ్డు విస్తరణలో భాగంగా మిద్దె సెంటర్ నుంచి వడ్లపూడి సెంటర్ వరకు ఉన్న దుకాణదారులు, నిర్వాసితులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. పలువురు దుకాణదారులు, నిర్వాసితుల అభిప్రాయాలను సేకరించారు.
కమిషనర్ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందన్నారు. చేనేత వస్త్ర దుకాణదారులందరికి నగర నడిబొడ్డున చేనేత భవనం నిర్మాణం పూర్తి చేసి దుకాణాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరికి ఎలాంటి నష్టం లేకుండా ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణల తొలగింపుతోపాటు రోడ్డుకు అవసరమైన మేరకు స్థలం సేకరించి వారికి నిబంధనలకు అనుగుణంగా తగు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. 2006 మాస్టర్ ప్లాన్ ప్రకారమే రోడ్డు విస్తరణ చేపడుతున్నామని రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేషన్ శారదాదేవి

రూ.75లక్షలతో డ్రెయిన్‌ల నిర్మాణం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రూ.75 లక్షల వ్యయంతో డ్రెయిన్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. డీఈ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరంలో జీయర్‌స్వామి ఆశ్రమం వెనుక నుంచి బోటు యార్డు రోడ్డు వరకు డ్రెయిన్‌లు నిర్మించాలని ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు వినతిపత్రం అందజేశారని, స్థానికంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో ఆ ప్రాంతం మొత్తం సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించి ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్‌తోపాటు ప్రతి రోడ్డులోను సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి రూ. 48 లక్షలు కేటాయించి సీసీ డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. మరో మూడు వారాల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. పెనుమాకలో అమరావతి రోడ్ నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రెండు వైపులా డ్రెయిన్‌లు నిర్మించేందుకు రూ.27 లక్షలు కేటాయించామని, ఆ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని డీఈ తెలిపారు.


పెనుమాకలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్

బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించాలి

మంగళగిరి: బీఎల్వోలు మరోసారి ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నూతన జాబితాలతో ప్రతి బీఎల్‌వో క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్లను విచారించి తమ ఓటులో ఏమైనా తప్పులుంటే సరిదిద్దేలా చూడాలన్నారు. అంతేకాక 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఒకే డోర్ నెంబర్‌లో అధిక ఓటర్లుతో పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌వో లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ఈఆర్‌వో కె హేమమాలిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్

పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్

నిడుముక్కల(తాడికొండ): తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక వి/ాన కళాశాల విద్యార్థులు సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణలో ఉన్న మొక్కలను తొలగించి ఊడ్చి పరిశుభ్రం చేశారు. త్వరలో మొక్కలు నాటనున్న నేపథ్యంలో స్థలాన్ని ఎంపిక చేసి చదును చేశారు. పలువురు గ్రామస్తులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటిపాడు(గుంటూరు): విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హెచ్చరించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డులో పనిచేస్తున్న వేమెన్స్‌తో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రైతులకు గానీ నష్టం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సవరించుకోవాలని కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలన్నారు. వేమెన్స్ వారికి కేటాయించిన మిర్చి కమీషన్ షాపులలో అందుబాటులో ఉంటూ నమ్మకంతో పనిచేయాలని సూచించారు. నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి, మార్కెట్ యార్డుకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి, యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి, వేమెన్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యార్డు చైర్మన్ రాజనారాయణ